

అనూహ్య స్పందన

'సాక్షి' స్పెల్–బీ, మ్యాథ్స్–బీ పరీక్షలకు అనూహ్య స్పందన లభించింది.

వివరాలు 8లో ▸



కురుమూర్తిగిరులు కిటకిట

కురుమూర్తిస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.2 / 13.1

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. నాలుగు కేంద్రాలలో 795 విద్యార్థులకుగాను 757 విద్యార్థులు హాజరయ్యారు. 38 మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు రాజేంద్రకుమారు తెలిపారు.

మద్దతు ధర గ్యారంటీ చట్టం తీసుకురావాలి



నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతు పండించిన పంటలన్నీటికి మద్దతు గల గ్యారంటీ చట్టం చేసి అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి యాదగిరి అన్నారు. ప్రగతిశీల, వ్యవసాయ కార్మిక సంఘం, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియాల ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగే సైకిల్ మోటార్ ర్యాలీపై ఆదివారం మండలంలోని కొల్లంపల్లి, అయ్యారుపల్లి, అంత్వార్, బోయిన్పల్లి, బోయిన్ పల్లి తాండ, లక్ష్మీపూర్, చిన్న జట్రం గ్రామాలలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కరోనా సమయంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకురాగా, రైతు సంఘాలు ఉద్యమించడంతో ఆ చట్టాలను రద్దు చేస్తూ పంటలకు స్వామినాథన్ సిఫారసుల కనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయుటకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటికీ వాటిని అమలు చేయలేదని, రైతు సంఘాల డిమాండ్ ప్రకారం(సి2+50) పంటల పెట్టుబడి 50శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే, 12 గంటల పని విధానం అమల్లోకి తీసుకొస్తున్న కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో తిరిగి దోపిడీకి అడ్డె లేకుండా చేసింది రైతు కార్మిక రంగాన్ని లేబర్ కోర్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 26న నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీలో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట రాములు, రాము, బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

నారాయణపేట: జర్నలిస్టుల కుటుంబాల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి పెన్షన్ పొందుతున్న పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సిందిగా జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ రషీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన లైఫ్ సర్టిఫికెట్ నవంబర్ 30 లోగా పెన్షన్ దారులు స్వయంగా జిల్లా పౌర సంబంధాల అధికారి ముందుకు వస్తే అక్కడే లైఫ్ సర్టిఫికెట్ జారి చేయడం జరుగుతుందని తెలిపారు. సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని వారి పెన్షన్ నిలుపుదల చేసే అవకాశం ఉన్నందున జిల్లాలోని జర్నలిస్టు పెన్షన్ దారులు గుర్తుంచుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో విజేతగా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభకనబరిచి విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో వచ్చే నెల 7 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ టోర్నమెంట్ ఉంటుందన్నారు. ఎంపికలకు జిల్లావ్యాప్తంగా 36 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారని, వీరిలో 14 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశామన్నారు. వీరికి ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు మెయిన్ స్టేడియంలో ప్రత్యేక కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. క్యాంపులో ప్రతిభ కనబరిచిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. జిల్లా కబడ్డీ సంఘం కోశాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, బాలరాజు, పాపారాయుడు, పాల్గొన్నారు.

జిల్లా మహిళా ప్రాబబుల్స్..

వి.జ్యోత్స్న, సంగీత, జె.మౌనిక, ఎన్.శిరీష, వి.పార్వతి, ఎం.నందిని, జె.గంగ, పి.సింధూజ, వి.ఇందుబాయి, కె.మౌనిక, ఎస్.మనీష, డి.లక్ష్మి, జె.ఇందుప్రియ, ఎం.గాయత్రి ఎంపికయ్యారు.





నారాయణపేట ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ముగిసిన కుటుంబ సర్వే

జిల్లాలో 99.5 శాతం పూర్తి

- సర్వే వివరాల కంప్యూటరీకరణ వేగవంతం
- మొత్తం 1.56 లక్షల కుటుంబాల వివరాల సేకరణ
- పాల్గొన్న 1,181 మంది ఎన్యుమరేటర్లు.. 118 మంది సూపర్‌వైజర్లు

నారాయణపేట: జిల్లాలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ముగిసింది. కలెక్టర్ దిశానిర్దేశం, ఇతర జిల్లా అధికారుల పర్యవేక్షణ నడుమ 15 రోజులుగా ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 1181 మంది ఎన్యుమరేటర్లు ఈ నెల 6వ తేదీ నుంచి 8 వరకు 1,55,999 నివాస గృహాలను గుర్తించి స్టిక్కర్లు అంటించగా.. 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించి శుక్రవారంతో పూర్తి చేశారు. గ్రామాల్లో, మున్సిపాలిటీ కేంద్రాల్లో సర్వే చేపట్టిన సమయంలో 118 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలను సమర్పించారు.

సమాచారం సగమే

ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకుంటున్న సమయంలో 75 రకాల ప్రశ్నలకు సమగ్ర సమాచారం ఇచ్చేందుకు జనం జంకుతూ కనిపించారు. వివరాలు సేకరించేందుకు ఒక్కో ఇంటికి 30 నుంచి 40 నిమిషాల సమయం పట్టింది. సర్వేలో సగం సమాచారం మాత్రమే ఎన్యుమరేట్లు సేకరించారు. సర్వే ఫారంలోని 56 ప్రశ్నలు...అనుబంధ ప్రశ్నలతో కలిపి 75 ప్రశ్నలకు ఎవరూ స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని చెప్పవచ్చు. యాజమానులు ఏ పనిచేస్తున్నారంటే చేసే పని కాకుండా ఇతర పనులను చెప్పినట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూములు తప్పా ఇతర స్థిర, చరాస్థుల వివరాలను చెప్పేందుకు ఇష్టపడలేదు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం పూర్తి స్థాయిలో వివరాలు తెలియజేయలేదని తెలుస్తోంది. ఆస్తులు, వార్షిక ఆదాయం, ఐటీ చెల్లింపులు, వాహనాలు తదితర విషయాలను చేప్పేందుకు ముందుకు రాలేదనేది బహిరంగ సమాచారమే. ఇంటి యాజమానులు ఏం చేస్తే వాటిని సర్వే ఫారాలలో ఎన్యుమరేటర్లు నమోదు చేశారు.

గడువులోగానే చేరుకున్నాం..

జిల్లాలో నిర్దేశించిన గడువులోగా 99.5 శాతం సర్వే పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా నివాస గృహలు 1,33,535 ఉండగా 1,33,415 నివాస గృహాల్లోని కుటుంబాలను సర్వే చేశాం. మున్సిపాలిటీల్లో 22,464 నివాస గృహాలను గుర్తించగా 22,954 కుటుంబాలు సర్వే చేయడం జరిగింది. మిగిలిన 5 శాతం కుటుంబాలను సైతం సర్వే చేస్తాం.

– యోగానంద్, సీపీఓ, నారాయణపేట

డేటా ఎంట్రీ వేగవంతం : వీసీలో కలెక్టర్

జిల్లాలో సమగ్ర సర్వే 99.5శాతం పూర్తి అయ్యిందని ఈనెల 28 లోగా సర్వే డేటా ఎంట్రీ పూర్తి చేస్తామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ వీసీలో వివరించారు. ఆదివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క రాంచి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తేయని, వారికి ఫోన్ కాల్ చేసి సర్వే తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమ బద్ధకరించుకోవాలన్నారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, పాఠశాలలో ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల అదనపు కలెక్టర్ బెన్ షాలం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మండలాల వారీగా సర్వే వివరాలిలా..

మండలం	మొత్తం కుటుంబాలు	సర్వే పూర్తయ్యింది	సర్వే శాతం	పాల్గొన్న ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు	ఈబీలు
మద్దూర్/కొత్తపల్లి	18,156	18,236	100	138	14	146
పేట	15,113	15,449	102	116	12	116
దామరగిద్ద	15,069	15,391	102	112	10	115
ఊట్కూర్	14,773	14,644	99.1	104	10	109
మక్తల్	13,894	13,632	98.1	107	11	107
కోస్గి/గుండుమాల్	12,241	11,382	93	89	09	96
మరికల్	10,641	10,590	99.5	77	08	77
నర్వ	10,146	9,956	98.1	65	07	69
ధన్వాడ	8,950	9,460	106	73	07	73
మాగనూర్	7,283	7,320	101	51	05	55
కృష్ణ	7,269	7,325	102	56	06	54

మున్సిపాలిటీల్లో..

మున్సిపాలిటీ	మొత్తం కుటుంబాలు	సర్వే పూర్తయ్యింది	సర్వే శాతం	పాల్గొన్న ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు	ఈబీలు
నారాయణపేట	10,637	10,590	99.6	98	10	98
మక్తల్	6,276	6,520	104	53	06	53
కోస్గి	5,551	5,854	106	42	04	42

డేటా ఆన్‌లైన్ నమోదు వేగవంతం

జిల్లా వ్యాప్తంగా సేకరించిన 1,56,379 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో ఆపరేటర్లు, అధికార యంత్రాంగం తలమునకలైంది. ఈ నెల 28 వరకు వంద శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని కలెక్టర్ సిక్తాపట్నాయక్ వీసీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చెప్పుకొచ్చారు. ఆ దిశగా జిల్లాలోని ఎంపీడీఓ, తహసీల్దార్, మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డేటా ఎంట్రి ఆపరేటర్లతో సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నమోదు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

వైభవంగా ప్రజాపాలన విజయోత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

- 30న సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- రైతు సదస్సులో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుతున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం నుంచి శనివారం వరకు మహబూబ్‌నగర్‌లో పెద్దఎత్తున రైతు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రజా విజయోత్సవ సభ, రైతు సదస్సు నిర్వహణపై ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పాలన చేస్తున్న ప్రజా ప్రభుత్వం సంవత్సర కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిపేందుకు శనివారం ప్రజా విజయోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో నిర్వహించే రైతు సదస్సులో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వాములు చేస్తూ వైభవంగా నిర్వహిస్తామన్నారు. రైతు సదస్సులో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి 150 స్టాళ్ల ఏర్పాటు చేస్తామని, ఇందులో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన పద్ధతులు, అధునాతన యంత్ర పరికరాలు, వంగడాలు, విత్తనాలు సంబంధించి రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఏడాది కాలంలో రైతులు, మహిళలు, యువతకు సంబంధించి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ పాలమూరు ముఖ్యమంత్రి సొంత జిల్లా అని, సీఎం పాల్గొననున్న రైతు సదస్సును ఘనంగా నిర్వహించాలని సూచించారు. సదస్సులో రైతులకు స్ప్రింక్లర్లు, డ్రిప్, ఇరిగేషన్ ప్రదర్శనలు, పామాయిల్ సాగుపై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల

మద్దూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల హాస్టల్ వార్డెన్లకు సూచించారు. ఆదివారం మండలంలోని పెదిరిపాడ్‌లోని కేజీబీవీ, మద్దూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రెండు చోట్ల విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. వంట గదులు, మూత్రశాలలను, బియ్యం నిల్వలు, పప్పు, కురగాయాలను పరిశీలించారు. బియ్యం బాగో లేకపోతే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుచిశుభ్రత కలిగిన భోజనం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని మినీ స్టేడియం, బాదేపల్లి హైస్కూల్ మైదానాల్లో సోమవారం నుంచి ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇందులో రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి బాలుర, బాలికలు 10 జట్ల చొప్పున 20 జట్లు పాల్గొననున్నాయి. బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో బాలికలకు, మినీ స్టేడియం మైదానంలో బాలుర పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. టోర్నీని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించనున్నారు.

29 వరకు 'సర్వే' ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి

మద్దూరు: రాష్ట ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, కుల గణన సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. ఉమ్మడి మద్దూరు మండలంలో దాదాపు 18వేల ఇళ్లలో సర్వే ఇప్పటికే పూర్తయిందని, ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడం కోసం మద్దూరు ఎంపీడీఓ కార్యాలయంలో 24, కొత్తపల్లిలో 5 డేటా ఎంట్రీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి మండలంలో దాదాపు 900 ఇళ్ల డేటాను అన్‌లైన్‌లో ఎంట్రీ చేసినట్లు డీపీఓకు వివరించారు. ఈ నెల 29 వరకు డేటా ఎంట్రీని పూర్తి చేయాలని అపరేటర్లకు డీపీఓ సూచించారు. ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

నడిగడ్డలో నకిలీ మద్యం.. మళ్లీ కలకలం!

కర్ణాటక నుంచి క్యారమిల్.. ఏపీ నుంచి స్పిరిట్

- ఇద్దరు సూత్రధారుల ఆధ్వర్యంలో దందా
- ఉమ్మడి జిల్లాలో పలు బెల్ట్‌షాపులకు సరఫరా
- రానున్న ఎలక్షన్లే టార్గెట్‌గా పలువురితో బేరసారాలు
- ఆదిలోనే అడ్డుకున్న గద్వాల ఎక్సైజ్ యంత్రాంగం
- ఒకరి అరెస్ట్.. పరారీలో కీలక నిందితుడు రవినాయుడు
- అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ?



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం పాతపాలెంలో సుమారు రెండేళ్ల క్రితం నకిలీ మద్యం తయారీ రాకెట్ గుట్టు రట్టు కాగా.. సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా అదే జిల్లాలో నకిలీ మద్యం జాడలు మళ్లీ వెలుగు చూశాయి. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణంలో ఇటీవల నకిలీ మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని (ఏపీ 29 బీడబ్ల్యూ 4444) ఎక్సైజ్ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. 30 లీటర్ల నకిలీ మద్యంతో పాటు క్యారమిల్ (మద్యంలో కలిపే రంగు), స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇద్దరు నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయారు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు తీగ లాగితే డొంక కదిలినట్లు తెలుస్తోంది.

ఇద్దరు సూత్రధారులు..

కల్తీ మద్యం తయారీ, రవాణాకు సంబంధించి ఎక్సైజ్ అధికారులు కూపీ లాగగా.. ఇద్దరు సూత్రధారుల ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ దందా కొన్ని నెలలుగా సాగుతున్నట్లు తేలింది. ఆ మద్యాన్ని ఉమ్మడి పాలమూరుతో పాటు సమీపంలోని వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలోని పలు బెల్ట్ షాపులకు సైతం సరఫరా చేసినట్లు తెలుస్తోంది. గద్వాల జిల్లా గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రవినాయుడు మరి కొంతమందితో కలిసి కొంతకాలంగా అయిజ పట్టణంలో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌ను అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చిన్న ఉరుకుందుగౌడ్ కొంతకాలంగా డీసీఎం వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం వీరిద్దరికి ఒక ఒప్పందం కుదిరింది. చిన్న ఉరుకుందుగౌడ్ నకిలీ మద్యం తయారు చేయాలి.. దాన్ని రవినాయుడికి అందజేయాలి. ఈ మేరకు రవినాయుడు.. చిన్న ఉరుకుందుగౌడ్ బ్యాంక్ ఖాతాలో రూ.80వేలు జమచేశాడు. మరో రూ.40 వేలను నగదు రూపకంగా ఇచ్చాడు.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు?

నకిలీ మద్యం తయారీ, రవాణాకు సంబంధించి తుమ్మలపల్లికి చెందిన చిన్న ఉరుకుందు గౌడ్‌ను ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. అసలు నిందితుడు రవినాయుడితో పాటు మరో ఇద్దరు నిందితులు పెద్ద ఉరుకుందు, బోయ బీమేష్ నాయుడు పరారీలో ఉన్నారు. ఈ నెల 13న కేసు నమోదు కాగా.. కీలక నిందితుడు రవినాయుడిని ఇంకా పట్టుకోకపోవడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతడిని అరెస్ట్ చేయకుండా ఎక్సైజ్ అధికారులపై గద్వాల నియోజకవర్గ అధికార పార్టీకి చెందిన ఓ మహిళా నేత బంధువుతో పాటు పార్టీ మండలాల నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పదనుకుంటే తూతూ మంత్రపు కేసులతో సరిపెట్టాలని.. అతడు లొంగిపోయేందుకు సహకరిస్తామని చెప్పినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డిని 'సాక్షి' సంప్రదించగా.. 'నకిలీ మద్యం తయారీ కేసును ఛేదించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాం. మరి కొంత మంది వ్యక్తులు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తాం. ఆ తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తాం.' అని సమాధానమిచ్చారు.

కర్ణాటక నుంచి క్యారమిల్.. ఏపీ నుంచి స్పిరిట్

నకిలీ మద్యం తయారీకి సంబంధించి ఆ ఇద్దరు మరికొందరి సాయంతో క్యారమిల్‌ను కర్ణాటకలోని రాయచూరు నుంచి.. స్పిరిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి సేకరించారు. చిన్న ఉరుకుందు గౌడ్ సీటీలో క్యారమిల్, స్పిరిట్ కలిపి నకిలీ మద్యం తయారు చేశాడు. ఇది వరకే సేకరించుకున్న ఖాళీ మద్యం సీసాల్లో ఈ శాంపిళ్లను పోసి కొందరికి ఇచ్చాడు. పలు బెల్ట్‌షాపులకు సరఫరా చేశాడు. అంతా సజావుగా సాగుతుండడంతో ఆ ఇద్దరు కలిసి రానున్న స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పోటీలో నిలవాలని భావిస్తున్న వారిని టార్గెట్‌గా పెట్టుకుని పావులు కదిపినట్లు సమాచారం. ఈ మేరకు పలు రహస్య స్థలాల్లో ఇప్పటికే నకిలీ మద్యం సీసాలను దాచినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 13న బేరమాడేందుకని స్కార్పియో వాహనంలో కొన్ని శాంపిళ్లను పెట్టుకుని వస్తుంటే అయిజ పట్టణంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం రవినాయుడు, చిన్న ఉరుకుందుగౌడ్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.



గద్వాల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిందితుడు చిన్న ఉరుకుందుగౌడ్‌తో ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

క్లుప్తంగా

చలి తీవ్రతతో వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చలి తీవ్రతకు మృతిచెందాడు. ఆదివారం ఉదయం గుర్తించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చనిపోయిన వ్యక్తికి 45 ఏళ్ల వయసు ఉంటుందని.. ప్యాంట్, స్వెట్టర్ ధరించి సిమెంట్ బెంచీపై పడుకొని అలాగే ప్రాణాలు వదిలారని పోలీసులు తెలిపారు. మృతదేహం పక్కన ఉన్న సంచిలో లభించిన ఆధారాలతో బీహార్‌కు చెందినవాడిగా గుర్తించారు. ఎస్‌ఐ సతీశ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామపంచాయతీ వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 87126 57721 సంప్రదించాలని సూచించారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ రైల్వేస్టేషన్‌లో సమీపంలో ఉన్న వంతెన వద్ద ఆదివారం ఇంటర్‌సిటీ రైలు ఢీకొని 25 ఏళ్ల యువకుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. మృతుడి కుడిచేతిపై సాయమ్మ అనే పచ్చబొట్టు ఉందని.. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు చెప్పారు. స్టేషన్‌మాస్టర్ నర్సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 98480 90426 సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నర్వ: మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన వివాహిత అశ్విని (22) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఎస్‌ఐ కుర్మయ్య వివరాల మేరకు.. జంగంరెడ్డిపల్లికి చెందిన కావలి కుర్మయ్యకు ముగ్గురు కూతుళ్లు ఉండగా.. రెండవ కుమార్తె అశ్వినిని అదే గ్రామానికి చెందిన మెట్ల సతీష్‌కు ఇచ్చి 2021లో వివాహం జరిపించారు. అయితే కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం భర్త సతీష్.. అశ్వినిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయంపై గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినప్పటికీ అతడి వేధింపులు ఆగలేదు. ఈ నెల 8న రాత్రి డబ్బుల విషయంపై అశ్వినితో గొడవపడి కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అశ్విని.. ఈ నెల 9న గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం మరికల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు/ మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుందని పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 1,507 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి చేపట్టారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 1,204 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు, కుడి కాల్వకు 450, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు వదలగా.. మరో 72 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.480 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడుకు 730 క్యూసెక్కులు..

రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 988 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.


పరీక్ష సరళిని పరిశీలిస్తున్న 'సాక్షి' మహబూబ్‌నగర్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ శ్యాంసుందర్


పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

స్పెల్-బీ, మ్యాథ్స్-బీ పరీక్షలకు

అనూహ్య స్పందన

విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై ఆసక్తి పెంచడం.. గణిత చతుర్విత ప్రక్రియలపై మక్కువ పెంపొందించేందుకు గాను 'సాక్షి', అసోసియేట్ స్పాన్సర్ పార్టనర్ ట్రాప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి, ప్రెసెంటింగ్ స్పాన్సర్ డ్యూక్స్ వెపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్పెల్-బీ, మ్యాథ్స్-బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. రెండు వారాల క్రితం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు ఆదివారం మహబూబ్‌నగర్‌లోని మౌంట్‌బాసిల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో క్వార్టర్ ఫైనల్ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 250 మందికి పైగా విద్యార్థులు స్పెల్-బీ, మ్యాథ్స్-బీలకు హాజరై ఉత్సాహంగా పరీక్షలు రాశారు. వివిధ స్థాయిల్లో నిర్వహించే ఈ పరీక్షలను రాయడం వల్ల విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవడంతో పాటు గణితం, ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. – మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP | SAKSHI SPELL Bee 2024-25 | SAKSHI MATH BEE 2024-25

ఇంగ్లిష్ గ్రామర్ రావాలని..



స్పెల్-బీ పరీక్ష గతంలో కూడా రాశాను. దీన్ని వల్ల ఇంగ్లిష్ గ్రామర్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించగలను అనే నమ్మకం వచ్చింది. పరీక్షలో ప్రశ్నలను చూస్తే సులభంగా సమాధానాలు రాయగలమనే కాన్ఫిడెన్స్ వస్తుంది. పాఠశాల స్థాయిలోనే ఒక పోటీ పరీక్ష రాశామన్న సంతోషం ఉంది. మంచి మార్కులు సాధిస్తా.

– కార్తీక్, 8వ తరగతి, అక్షర స్కూల్, కొల్లాపూర్

సులభంగా రాశాను..



స్పెల్-బీ పరీక్ష రాసే క్రమంలో ప్రశ్నలు సులువుగా అర్థమయ్యే విధంగా ఉండటంతో జవాబులను కూడా సులభంగా రాశాను. ఈ పరీక్ష రాయడం వల్ల ఏ పరీక్ష అయినా సులభంగా రాయగలనని అనిపించింది. ఈ పరీక్ష ఎప్పుడు నిర్వహించినా నేను రాస్తాను. దీంతో ఇంగ్లిష్ మరింత నేర్చుకునేందుకు ఉపయోగపడుతుంది.

– గ్రీష్మిక, 7వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్, మహబూబ్‌నగర్

భయం పోతుంది..



మ్యాథ్స్-బీ పరీక్ష కోసం కొన్ని రోజుల పాటు సిద్ధమయ్యా. ఇందుకోసం ఇచ్చిన మెటీరియల్‌ను చదివాను. పరీక్షలో వచ్చిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశాను. పరీక్ష రాయడం మంచి అనుభూతినిచ్చింది. ఈ పరీక్ష రాయడం వల్ల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరిగింది. భవిష్యత్‌లో ఎలాంటి పరీక్ష అయినా సులభంగా రాయగలననే నమ్మకం ఉంది.

– విశిష్ట, 9వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్, మహబూబ్‌నగర్

పరీక్షలపై ఆసక్తి..



స్పెల్-బీ పరీక్ష వివిధ దశల్లో రాయడంతో పోటీ పరీక్షలపై ఆసక్తి పెరిగింది. పరీక్ష సమయం కంటే ముందుగానే పూర్తిచేశాం. ప్రతి ప్రశ్న సులభంగా అర్థం చేసుకునేలా ఉన్నాయి. పరీక్షలో మంచి మార్కులు సాధిస్తా. పాఠశాలలోనే కాకుండా బయట పరీక్షలను కూడా ఇబ్బందులు లేకుండా రాయగలమనే నమ్మకం పెరిగింది.

– ఛత్రపతి, 4వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్, మహబూబ్‌నగర్

సులభ పద్ధతిలో గణితం..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్స్-బీ పరీక్షను గతంలో కూడా రాశాను. ఆ పరీక్షలో మంచి మార్కులు వచ్చాయి. దీంతో ఈ సంవత్సరం కూడా పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యాను. మ్యాథ్స్ చేయడానికి వచ్చినప్పటికీ.. సులభ పద్ధతిలో వేగంగా ప్రశ్నలకు సమాధానాలను రాసే విధంగా ఇక్కడ ఇచ్చిన మెటీరియల్‌లోని మెథడ్స్ ఉపయోగపడతాయి.

– మోనీష, 8వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్, మహబూబ్‌నగర్

మంచి మార్కులు సాధిస్తా..



పరీక్షలో తప్పులు దొర్లకుండా నేరుగా సమాధానం రాసే విధంగా ప్రశ్నలు ఉన్నాయి. పరీక్ష బాగా రాశాను. మంచి మార్కులు సాధిస్తా. ఎప్పుడు పరీక్ష నిర్వహించినా పాల్గొంటా. 'సాక్షి' స్పెల్-బీ పరీక్ష రాయడం మంచి అనుభవాన్ని ఇచ్చింది. గ్రామర్, స్పెల్లింగ్ వంటి వాటికి సంబంధించి పరీక్ష ఎలా రాయాలనే విషయం తెలిసి వచ్చింది.

– సాహితి, 7వ తరగతి, అపెక్స్ స్కూల్, మహబూబ్‌నగర్

నైపుణ్యం పెరుగుతుంది..



ఈ పరీక్షతో కాంపిటేటివ్ స్కిల్ పెరుగుతుందని భావిస్తున్నా. కొన్ని సంవత్సరాలుగా 'సాక్షి' స్పెల్-బీ పరీక్ష రాస్తున్నా. పరీక్షకు సంబంధించిన మెటీరియల్ ద్వారా ఇంగ్లిష్ ప్రనౌన్సియేషన్, లిటరేచర్ స్కిల్ వంటి వాటికి ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష రాసిన ప్రతిసారి చాలా అంశాలను నేర్చుకుంటున్నా.

– కీర్తన, 9వ తరగతి, పీపుల్స్ స్కూల్, కొత్తకోట

'సాయిరెడ్డిది రేవంత్ కుటుంబం చేసిన హత్య'

కల్వకుర్తి టౌన్/ వెల్దండ: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డిది ఆత్మహత్య కాదని.. అది పూర్తిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ కుటుంబం చేసిన హత్య అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సాయిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కల్వకుర్తితోపాటు వెల్దండలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి చనిపోయాడంటే వారి అరాచకాలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవాలన్నారు. సీఎం స్వగ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర డీజీపీ వెంటనే స్పందించి సాయిరెడ్డిని ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో అనేక విషయాలు బయటకు వస్తున్నాయని, పేదలు, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుతానికి సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



ఉమ్మడి జిల్లాలో 120 మంది హోంగార్డుల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తూ మూడేళ్లు పూర్తి చేసుకున్న హోంగార్డులను బదిలీ చేశారు. జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలో పనిచేస్తూ మూడేళ్లు పూర్తి చేసుకున్న హోంగార్డులను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేస్తూ.. ఇక్కడ ఉన్నవారిని ఆయా జిల్లాలకు బదిలీ చేయడం జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 120 మంది హోంగార్డులను బదిలీ చేస్తూ ఆయా జిల్లాలకు కేటాయించారు. ఈ బదిలీల ప్రక్రియపై మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక కసరత్తు నిర్వహించి జిల్లాల వారిగా పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ అయిన హోంగార్డులు రెండు రోజుల్లో కేటాయించిన స్థానాలకు వెళ్లనున్నారు.

కిడ్నాపర్లను పట్టుకున్న పోలీసులు


నాంపల్లి పోలీసులకు చిన్నారిని అప్పగిస్తున్న ఉండవెల్లి పోలీసులు

- హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రి నుంచి చిన్నారి అపహరణ
- జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పట్టివేత
- నాంపల్లి పోలీసులకు అప్పగింత

అలంపూర్: పసిపిల్లలను అపహరించిన కిడ్నాపర్లను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అపహరణకు గురైన పసిపిల్లలను, నిందితులను పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకొని.. హైదరాబాద్‌లోని నాంపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో 45 రోజుల వయసు ఉన్న పిల్లాడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పసిపిల్లాడి తల్లి హసీనా హైదరాబాద్‌లోని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు పసిపిల్లాడిని అపహరించిన వాహనం కర్నూలు వైపు వెళ్తుందని నిర్ధారించారు. దీంతో ఉన్నతాధికారుల సమాచారంతో ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్, మానవపాడు ఎస్‌ఐ చంద్రకాంత్ సిబ్బందితో ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన ఓమ్నీ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో ముగ్గురు పసిపిల్లలు, ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. పసిపిల్లలో ఇద్దరు మగ పిల్లలు కాగా.. మరొకరు ఆడబిడ్డ ఉండగా.. రూ.20 వేల నగదు లభించింది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో పోలీసులు ముగ్గురు పసిపిల్లలు, ముగ్గురు నిందితులు, ఓమ్నీ వ్యాన్‌తోపాటు రూ.20 వేల నగదును నాంపల్లి పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిటకిటలాడిన కురుమూర్తిగిరులు


ఆలయ ఆవరణలో భక్తులు


కురుమూర్తిస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్‌లో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి తడి దుస్తులతో మెట్లపై దీపాలు వెలిగించగా.. మరికొందరు కొబ్బరికాయలు కొట్టి దాసాంగాలు సమర్పించి గండదీపాలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. అలువేలుమంగ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపంలో భక్తుల రద్దీ కనిపించింది. జాతర మైదానంలో వెలిసిన దుకాణాల్లో భక్తులు మిఠాయిలు, పిల్లలకు ఆట వస్తువులు, గాజులు కొనుగోలు చేశారు.

జోరుగా మాంసం విక్రయాలు..

జాతరలో లభించే కాల్చిన మాంసం ఆరగించేందుకు వివిధ ప్రాంతాల వారు తరలివచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో రద్దీ బాగా ఉంది.

భక్తుడిపై ఎస్‌ఐ దాడి

కురుమూర్తిస్వామి దర్శనానికి వచ్చిన పర్దిపూర్ గ్రామానికి చెందిన రాములు తనపై ఎస్‌ఐ శేఖర్ దాడి చేశాడని ఆరోపించారు. వివరాలు రాములు ఆదివారం కురుమూర్తిస్వామి దర్శనానికి రాగా.. జాతర ప్రాంగణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఎస్‌ఐ అడ్డగించి దాడికి పాల్పడటంతో ముఖం పైభాగంతోపాటు వీపులో గాయాలయ్యాయని వాపోయాడు. ఈ విషయమై ఎస్‌ఐ స్పందిస్తూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉందని ద్విచక్రవాహనాన్ని మాత్రమే ఆపానని, దాడి చేయలేదని పేర్కొన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న కాళేశ్వరం ఎంక్వైరీ కమిషన్ చైర్మన్


చంద్రఘోష్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, అధికారులు

అలంపూర్: అలంపూర్ ఆలయాలను ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ పినాకి చంద్రఘోష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.



మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని..

తండ్రిని కడతేర్చిన తనయుడు

- వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లిలో ఘటన

శాంతినగర్: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని కన్నతండ్రిని కొడుకు హతమార్చిన ఘటన వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. జక్కిరెడ్డిపల్లికి చెందిన ఆకుల ఉప్పరి కృష్ణయ్య(52), అతడి కొడుకు యుగంధర్ మద్యం తాగారు. ఇంట్లో డీజే పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేశారు. ఈ క్రమంలో మరింత మద్యం తాగడానికి తనకు డబ్బులు ఇవ్వాలని యుగంధర్ తన తండ్రి కృష్ణయ్యను కోరాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని అతడు చెప్పడంతో కోపోద్రిక్తుడైన కొడుకు.. ఇంట్లో దొరికిన వస్తువులతో దాడికి పాల్పడ్డాడు. దీంతో కృష్ణయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడితో పాటు కూతురు, భార్య ఉన్నారు.

క్రీడా హబ్‌గా మహబూబ్‌నగర్ జిల్లా


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన నెట్‌బాల్ సెలక్షన్స్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెలక్షన్స్‌కు వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడలకు హబ్‌గా మారిందని, ఇక్కడి నుంచి ఎంతో మంది క్రీడాకారులు ఏషియన్ గేమ్స్, ఇతర క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్ నిర్వహిస్తున్నామని, ఈ పోటీలతో క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికియతీయవచ్చన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానుందని, దీంతో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలకులు గాడ్సన్‌బాబు, సరయు, వైష్ణవి, రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ పరిశీలకులు సునీల్‌కుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్య, ఖాజాఖాన్, సురేష్‌కుమార్, సాదత్‌ఖాన్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ జట్ల ఎంపికలు

వచ్చే ఏడాది జూన్‌లో కొరియాలో జరిగే ఏషియన్ యూత్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే మహిళా జట్టు, న్యూఢిల్లీలో వచ్చే ఏడాది మే నెలలో జరిగే ఏషియన్ మెన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే పురుషుల జట్టు మొదటి దఫా ఎంపికల్లో భాగంగా దక్షిణ భారతదేశ క్రీడాకారుల ఎంపికలు పూర్తిచేశామని నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, ఎంపికల ఇన్‌చార్జ్ విక్రమాదిత్య తెలిపారు. ఈ ఎంపికలకు వివిధ రాష్ట్రాల నుంచి పురుషులు 25 మంది, మహిళలు 25 మంది పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు జనవరిలో శిక్షణ ఉంటుందన్నారు.

జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్ల ఎంపిక..

వచ్చే జనవరిలో ఉత్తరాఖండ్‌లో జరిగే 38వ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం ట్రెడిషనల్ నెట్‌బాల్ పురుషులు, మహిళలు, ఫాస్ట్- 5 పురుషులు, మహిళలు, మిక్స్‌డ్ అంశాల్లో రాష్ట్ర జట్లు అర్హత సాధించాయని, ఈ మేరకు క్రీడల్లో పాల్గొనే ఐదు జట్ల క్రీడాకారులను నెట్‌బాల్ సంఘం ప్రతినిధులు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 90 మంది పురుషులు, 80 మంది మహిళలు ఎంపికల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో 50 మంది పురుషులు, 50 మంది మహిళలను వచ్చే నెలలో జరిగే కోచింగ్ క్యాంప్‌నకు ఎంపిక చేశామని వెల్లడించారు.

రాష్ట్ర పుష్పంపై రవిబింబం



రాష్ట్ర పుష్పం తంగెడి పూలపై సవారి చేస్తున్నట్లు సూర్యుడు కనువిందు చేశాడు. ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం సందర్భంగా సూర్యుడు పసుపు వర్ణపు సీతాకోకచిలుకల చెంత ఆడుతున్నట్లు తంగెడి చెట్టు పూలపై కనిపించి ఆకట్టుకున్న దృశ్యాన్ని నవాబ్‌పేట శివారులో 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. – నవాబ్‌పేట

